ప్రజాశక్తి

మంగళవారం 29 ఏప్రిల్ 2025

5

అల్లూరి సీతారామరాజు

వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కిండంగి రామారావు తెలిపారు. మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టిడిపి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ గా రఘురామ కృష్ణంరాజు రాజ్యాంగ బద్ధమైన పదవులో కొనసాగుతూ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పై మీడియా ముందు అనుచితంగా మాట్లాడటం సరికాదన్నారు.900 పేదల గుడిసెలను జెసిబిలతో తొలగించిన సంఘటన స్థలంలో సందర్శించిన వి శ్రీనివాసరావు పేదల పక్షాన మాట్లాడినందుకు డిప్యూటీ స్పీకర్ వ్యక్తిగత దూషణలు చేయడం సరైన పద్ధతి కాదని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు జి.చిన్నబాబు, కొర్రా మగ్గన్న, కిల్లో జగన్నాథం, జి.బుజ్జిబాబు, తాంగుల హరి, బడ్నాయక్ కోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో..

మెగా డిఎస్సి నోటిఫికేషన్ నిలుపుదల చేయాలి

- కలెక్టర్‌కు స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ వినతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాకు సంబంధించి మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ నిలుపుదల చేయించాలని ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల కోసం తాము తలపెట్టిన రాష్ట్ర రాష్ట్ర మన్యం బందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2025 ఏప్రిల్ 20న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించి ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, 5వ షెడ్యూల్డ్ ఏరియాలో 100 శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 400 పోస్టులకు గాను ఎస్టీలకు కేవలం 24 పోస్టులు మాత్రమే కేటాయించారన్నారు. ఆదివాసీలకు 6శాతం, నాన్ ట్రైబల్‌కు 94శాతం పోస్టులు కేటాయించడంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీనిని. ప్రభుత్వం పున:పరిశీలన చేయాలని కోరారు. తక్షణమే నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి, ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీల కోసం ప్రత్యేక డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయుటకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఆదివాసీ రిజర్వేషన్, హక్కులు, చట్టాలు రక్షణకై తక్షణమే జిల్లా జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్లో ఏజెన్సీ పోస్టులు మినహాయించాలని కోరారు. ఈ మేరకు పలు డిమాండ్లతో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు పి.అప్పలనరస, కుడుముల కాంతారావు, వల్ల వెంకట రమణ, కే.కొటిబాబు, కూడా సుబ్రహ్మణ్యం, కూడ రాధాకృష్ణ, వంతల నాగేశ్వరావు, వంతల దాస్, శెట్టి నాగరాజు, సింహాద్రి, వై కుమార్, దన్నేటి పలాస శంకర్, పాత్రుడు రాధా, ప్రశాంత్ కుమార్, మొండిపల్లి చిరంజీవి, కోర్ర చిన్నారి, పిట్ట నరేష్, సోమేలి బాలరాజు, భాను, తదితరులు పాల్గొన్నారు

పాడేరు:ః ఆదివాసి ప్రాంతంలో స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆదివాసి ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగాల ఆదివాసులకు ఇవ్వాలని పాడేరు గిరిజన ఉద్యోగుల భవనంలో సోమవారం స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ కన్వీనర్ దన్నేటి పలాసి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో. కో కన్వీనర్ పాత్రుడు రాధాకృష్ణ మాట్లాడుతూ,: సీఎం చంద్రబాబునాయుడు అరకులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 30 న పాడేరు ఐటీడీఏ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని, అదేవిధంగా స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ సాధనకై మే 2 తేదీ నుండి నిరవదిక బంద్ ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కిల్లో రాజారావు, రొబ్బ ప్రశాంత్ కుమార్, మొండిపల్లి చిరంజీవి, వంతాల నాగేశ్వరరావు, కర్జ వై కుమార్, కూడ రాధాకృష్ణ, కొర్ర చిన్నారి, సోమేలి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న డిఎస్‌సి సాధన కమిటీ సభ్యులు అప్పలనర్స, కాంతారావు, తదితరులు

మన మిత్ర యాప్ కరపత్రాలను విడుదల చేస్తున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ తదితరులు

'మన మిత్ర' ద్వారా 250 రకాల సేవలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా 250 రకాల సేవలు పొంద వచ్చని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజల చేతిలో మన ప్రభుత్వం మన మిత్ర యాప్ కరపత్రాలను సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డిఎల్‌డిఒ కే.కోటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు తదితరులతో కలిసి పిఒ ఆవిష్కరించారు. అనంతరం పిఒ సింహాచలం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 955230009కు హాయ్ అని పంపి సేవలు పొందవచ్చని చెప్పారు. సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తి యాప్ ఉపయోగించు కోవాలని సూచించారు. ఎక్కడైనా మీకు అనుమానం వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, తహశీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావుదొర, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, జిసిడిఎం పార్వతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర సర్వే

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్రమైన సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారుల పైనే ఉందన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలులో ప్రభుత్వ భూముల ఆక్రమణనల తొలగింపునకు ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. భూముల ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామ సర్వేయర్, విఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి సంయుక్తంగా గ్రామాల్లో బంజరు భూములు, గ్రామ కంఠం ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సర్వే చేసి నివేదించాలని చెప్పారు. సర్వేలో రెవెన్యూ, సర్వే అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఆక్రమణనలకు పాల్పడిన వ్యక్తులకు నోటీసులు జారీ చేసి వారం గడిచిన తరువాత అనధికార ఆక్రమణలను అధికారులు తొలగించాలని స్పష్టం చేసారు. ప్రభుత్వ భూముల్లో అనధికారకంగా గృహాలు నిర్మిస్తే తొలగించాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణనల తొలగింపునకు చర్యలు చేపట్టాలని సూచించారు.రహదారల భవనాల శాఖ, పంచాయతీ రాజ్ (పంచాయతీ) నీటి పారుదల శాఖల భూముల ఆక్రమణలను గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ కంఠం భూముల్లో అధికారకంగా, అనధికారంగా ఎవరు ఉంటున్నారో గుర్తించాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, సర్వే సహాయ సంచాలకులు కె.దేవేంద్రుడు డిఎస్పీ షేక్ షహాబాజ్ అహమ్మద్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, ఎస్ఎంఐఇ ఆర్.రాజేశ్వరరావు, డి.ఇ. ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎయిర్ టెల్ టవర్ వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

ఎయిర్‌టెల్ సిగ్నల్స్ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ మారుమూల కిలో గూడ, మాదిమల్లు, గుమ్మిరేవులు గ్రామాల్లో మూడు నెలలుగా ఎయిర్ టెల్ సెల్, నెట్వర్క్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయా గ్రామాల గిరిజనులు సెల్ టవర్ల వద్దకు వెళ్లి ఎయిర్ టెల్ సేవలు అందుబాటులో వచ్చే విధంగా అధికారులు తక్షణమే స్పందించాలని నిరసన వ్యక్తం చేశారు. దూర ప్రాంతంలో ఉన్న బంధుమిత్రులు యోగక్షేమాలు తెలియక సతమతమవుతున్నామని వాపోయారు. మూడు నెలల నుంచి నెట్వర్క్ సేవల అందుబాటులో లేకపోయినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి సెల్ సేవలు నెట్వర్క్ సేవలు అందుబాటులో తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-సీలేరు

డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి

ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని జీకే వీధి మండలం సీలేరు పిహెచ్సి వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి సీలేరు పంచాయతీ పరిధిలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతిరోజు రెండు నుంచి మూడు లీటర్ల వరకు సగటున మంచినీరు తాగాలని, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్లకూడదని సూచించారు. ఒకవేళ వడదెబ్బకి ఎవరైనా గురైతే స్థానిక పిహెచ్సికి సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. ఉష్ణోగ్రత ప్రభావం వలన శరీరంలో నీటి శాతం క్రమేపి తగ్గిపోయి డిఆర్డినేషన్‌కి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎక్కువగా ఘనపదార్థాల కంటే ద్రవరూపంలో ఉన్న పానీయాలు శరీరానికి మేలు చేకూరుతుందని తెలిపారు. రిఫ్రిజిరేటర్‌లో నిలువ ఉంచిన శీతల పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు.

భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జెడ్‌పిటిసి, ఎంపిపి

కబ్జాకు పాల్పడుతున్న..

ఇటోర్ వెంచర్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - అనంతగిరి:ప్రభుత్వ, రైతుల జిరాయితీ భూముల కబ్జాకు పాల్పడుతున్న భూస్వాములపై కఠిన చర్యలు తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణిలు డిమాండ్ చేశారు. మండలంలోని నాన్ షెడ్యూల్ బీంపోలు పంచాయితీ సరియాపల్లి రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 69/5లో రైతుల సాగులో ఉన్న భూమిని ఇటోర్ వెంచర్ యజమాని, గిరిజనేతరుడు బి.నగేష్ అక్రమంగా కబ్జాకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం నేతలు సందర్శించి భూమిని పరిశీలించారు. అనంతరం పంచాయతీ సచివాలయం వద్ద రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి భూ కబ్జాకు గురైన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతుల సాగు భూములతో పాటు ప్రభుత్వ భూములపై కూడా కన్నేసి కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతుంటే రెవిన్యూ అధికారులు చూస్తూ ఎందుకు ఊరుకుంటున్నారని ప్రశ్నించారు. గిరిజన హక్కులు, చట్టాలను పరిరక్షించవలసిన అధికారులే తొత్తుగా వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు. బీంపోలు, గుమ్మకోట, గరుగుబిల్లి, ఎన్ ఆర్ పురం, రొంపల్లి నాన్ షెడ్యూల్ పంచాయతీలో జరుగుతున్న భూ అక్రమాణులపై రెవిన్యూ అధికారులు దృష్టి సారించవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అశోక్, ఉప సర్పంచ్ అప్పలకొండ, సర్పంచ్ పాగి. అప్పారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కిశోర బాలికలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: కిశోర బాలికలను గుర్తించి పలు విషయాలపై అవగాహన కల్పించడం పై మాత శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపీడీవో ఏవివి. కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐసిడిఎస్ సిడిపిఓ సంతోష్ కుమారి ఆధ్వర్యన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిశోర వికాసంలో భాగంగా మండలంలోని కిశోర బాలికలను గుర్తించి మే 2 నుండి జూన్ 10వ తేదీ వరకు పంచాయతీ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యం

బాధిత దంపతులు

ప్రజాశక్తి-రంపచోడవరం

దేవీపట్నం మండలం ఏనుగుల గూడెం గ్రామానికి చెందిన సుండం బాలమ్మ (మూగ, చెవిటి) తమకు పోలవరం ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుంటే ఆత్మహత్య శరణ్యమని పేర్కొన్నారు. బాధితులు బాలమ్మ, ఆమె భర్త అబ్బాయిదొర తెలిపిన వివరాలు ప్రకారం... బాలమ్మ, అబ్బాయి దొర ఈ నెల 21న రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కావేదికలో 18 ఏళ్లు నిండిన అర్హులైన తమకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇప్పటివరకు చెల్లించలేదని రంపచోడవరం సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. అయితే పెళ్లి చేసుకున్న కారణంగా ఆర్‌ఆర్ ప్యాకేజీకి వర్తించదని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు దీంతో వారు మనస్తాపం చెందిన సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ఆత్మహత్య చేసుకుంటామని ముందస్తుగా సమాచారం ఇచ్చారు. దీనితో అప్రమత్తమైన పోలీసులు వారు ఆత్మహత్యకు పాల్పడకుండా నిలువరింపజేశారు. వారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీస్నుకుని వెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో తాము ఆత్మహత్య ప్రయత్నం విరమించుకున్నట్లు బాలమ్మ, అబ్బాయిదొర తెలిపారు. బాధితులకు మద్దతుగా ఏనుగుల గూడెం చిన్నారిగండి గ్రామస్తులు సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్, దేవీపట్నం తహసీల్దార్‌తో తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై వారు స్పందిస్తూ మరలా గ్రామసభ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

బాధితులకు మద్దతుగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కమ్యూనిటీ మెంబర్స్‌తో అధికారుల ముఖాముఖి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని, రేఖపల్లి గ్రామంలో సోమవారం ఏఎస్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మెంబర్స్‌తో మండల స్థాయి అధికారులు సోమవారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం తహశీల్దార్ వై.సరస్వతి మాట్లాడుతూ గ్రామసభలో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇచ్చిన భూమికి ఆర్‌ఓఎఫ్‌ఆర్, వెబ్ ల్యాండ్‌కి సంబంధించి దరఖాస్తులు ఇచ్చారని, పైనుండి సూచనలు రాగానే వాటిని పరిశీలించి సర్వే చేస్తామని తెలిపారు. అన్ని గ్రామాలలోకి తాము రోజూ వెళ్లలేమని, ఏఎస్‌డిఎస్ ప్రతినిధి గాంధీ బాబు, వారి స్టాఫ్ ద్వారా గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకొని తమ దృష్టికి తీసుకొస్తే తాము యాక్షన్ తీసుకుంటున్నామని చెప్పారు. ఎంపీడీవో పి.రామాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ వితంతు పెన్షన్ ఇప్పుడు గ్రామ సచివాలయం లాగిన్‌లో ఆన్లైన్ చేస్తే ఆమోదం అవుతాయని తెలిపారు. రోడ్లకి సంబంధించి ఉపాధి పని ద్వారా పూర్తి చేస్తామన్నారు. రేఖపల్లి వెలుగు ఏటీఎం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళా జీవనోపాధికి బ్యాంకు లింకేజీలు, గ్రామ సంఘాలు సక్రమంగా నడవడానికి శిక్షణా కార్యక్రమాలు, బాలింతలు, పిల్లలకి,, గర్భిణీలకు న్యూట్రిషన్ గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. విఆర్.పురం, కూనవరం, మండలాల సిడిపిఒ నాగలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీలు, సర్పంచులు, యూత్ లీడర్, రైతులు, ఏఎస్‌డిఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దారు సరస్వతి

మేడేను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజులు

ప్రజాశక్తి-కూనవరం : మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు పిలుపునిచ్చారు. కూనవరం మండలం అయ్యవారిగూడెం గ్రామంలో శాఖా కార్యదర్శి పద్దం దేవి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ కార్మిక కర్షకుల దినోత్సవమైన మే డే ఎంతో విశిష్టమైనదని, దీనిని ప్రతి కార్మికుడు ఒక పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాల అమలులో వైఫల్యం చెందిందని విమర్శించారు.

జిఒ నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని చెప్పిన చంద్రబాబు పట్టించుకోలేదని, గిరిజన ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ కూడా తీయలేదని విమర్శించారు. సిపిఎం మండల కార్యదర్శి బాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పోలవరం ముంపు బాధితులుగా ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మడెం బాబు, కన్నారావు, విఆర్ పురం మండలం కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్ మూర్తి, కమ్మసిచ్చు సత్యనారాయణ గ్రామ మహిళలు యువత పాల్గొన్నారు.

హుకుంపేట: మే ఒకటిన ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పండగగా జరుపుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు టి అప్పలకొండ పడాల్, గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియా మాట్లాడుతూ అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన, పారిశుధ్య కార్మికులు, విఒలు, విఆర్‌పిలు, కాఫీ లైజన్ వర్కర్స్, విద్యుత్ శాఖలో పనిచేసేవారు ఇలా అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులంతా మండల కేంద్రంలో మేడే వేడుకలో పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మన్యంలో భారీ వర్షం

పాడేరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం మధ్యాహ్నం కుంభవృష్టిగా వాన కురిసింది. అప్పటివరకు ఎండ కాసినప్పటికీ, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం పడడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. మధ్యాహ్నం 1.30 గంటలకు మొదలైన వాన 3 గంటల వరకు కురిసింది. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు పంట పొలాల్లోని వర్షం నీరు వచ్చి చేరింది. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్లపై భారీగా మురుగునీరు ప్రవహించింది. వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

అరకులోయ రూరల్: అరకులోయ మండల పరిసర ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ప్రతి రోజూ ఉదయం పూట ఎండ కాసి, మధ్యాహ్నానికి వాతావరణంలో మార్పులు ఏర్పడి వర్షం కురుస్తుంది.

అనంతగిరి: మండలంలోని సోమవారం కుండపోతవాన కురిసింది. మధ్యాహ్నం ఈదురు గాలులు ఉరుములు మెరుపులు వడగలతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న జనజీవనానికి ఒక్కసారిగా వర్షం కురవడంతో ఉపశమనం లభించింది.

అనంతగిరిలో కురుస్తున్న వర్షం

పిజిఆర్ఎస్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ, సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి ఆ సమస్యలు పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి 50 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పిఒతోపాటు సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ స్వీకరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీడి జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, డాక్టర్ రతన్ తహాశీల్దార్లు పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్. శ్రీనివాసరావు దొర, ఈవోపిఆర్డి పద్మ, సిడిపిఒ సంధ్యారాణి, పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏ సిహెచ్‌కెవి చౌదరి, వెలుగు ఎపిడి దేగలయ్య, ఏయంఓ విజయ భాస్కర్, డిప్యూటీ తహాశీల్దారు త్రిమూర్తులు, శ్రీధర్, వి. రవీంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ, సాయి సతీష్, సుబ్బారావు, మల్లికార్జునరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, పిఎఓఎల్ .రాంబాబు, డిడి ఆఫీస్ సూపర్డెంట్ బి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు,

కుల ధ్రువీకరణ కేసులున్న డిఎస్‌సి అభ్యర్థులు 30న ఐటిడిఎకు రావాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : డీఎస్సీ 2025కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు కుల ధ్రువీకరణ కేసులు డిఎల్ఎస్‌సి నందు డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న అభ్యర్థులు ఈనెల 30 తేదీన ఉదయం 10 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి రావాలని ఐటిడిఏ పిఓ కట్టా సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల కేసులను త్వరితగతిన పరిష్కరిస్తామని, తద్వారా అభ్యర్థులు నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండవచ్చని ప్రాజెక్టు అధికారి తెలిపారు.

రోడ్లపైనే పశువుల సంచారం!

- ఎక్కడికక్కడే గుంపులుగా తిష్ట
- ప్రమాదం బారిన వాహనదారులు
- పెంపకందారుల్లో అవగాహనా లేమి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రహదారులపై గుంపులుగా సంచరిస్తున్న పశువులు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని గ్రామీణ ప్రాంత రహదారులపై పశువుల సంచారం పెరుగుతోంది. వీటి వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నా, వీటిని అరికట్టేందుకు సంబంధిత అధికారులు కనీసం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలూ ఉన్నాయి. గ్రామీణప్రాంతంలో పశువుల పెంపకందారులకు అవగాహన కల్పించడం, రహదారుల ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా రోడ్లుపైకి పశువుల రాకపోకలను నియంత్రించవచ్చని వాహనదారులు సూచిస్తున్నారు.

రాత్రివేళల్లో పశువులు రహదారులపై నిద్రించడం వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. ప్రధాన రహదారులపై పశువులను వదిలిపెట్టే యజమానులపై పశుసంవర్ధక శాఖ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధిస్తే భయపడి పశువులను రోడ్లపైకి వదలకుంఅ ఉంటారని భావిస్తున్నారు. పశువుల సంచార ప్రాంతాలలో వాహనదారులను హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచనలు ఉన్నాయి. పమాదాలను నివారించడంలో సహాయపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక గోశాలలను నిర్మించి, అక్కడ పశువులను ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మన్యంలో అనేక రోడ్డు ప్రమాదాలు, రహదారులపై పశువుల సంచారం వల్లే జరిగిందని వాహనదారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వీటి నియంత్రణకు అధికారులు తక్షణచ ర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మ్యూజియం నిర్మాణం పూర్తిచేయాలి

అర్ధాంతరంగా పనులు నిలుపుదలపై అసంతృప్తి : ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు

పనులను పరిశీలిస్తున్న డాక్టర్ డివిజి.శంకరరావు

ప్రజాశక్తి- చింతపల్లి: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మ్యూజియం పనులు నిలిచిపోయాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు అన్నారు. సోమవారం అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్‌లతో కలిసి తాజంగి, లంబసింగి గ్రామాల మధ్య నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంను సందర్శించారు. జరుగుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకరరావు మాట్లాడుతూ, గిరిజన సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసేలా స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం చేపట్టాలన్నారు. నాగరికతకు దూరంగా ఉన్న .గిరిజనులను గుర్తించిన అల్లూరి సీతారామరాజు ఆనాడు మన్య ప్రాంతాన్ని సందర్శించి ఆదివాసీలను గిరిజనులను చైతన్యం చేసి, పోరాటానికి సమాయత్తం చేశారని గుర్తు చేశారు. అల్లూరి కృషి ఫలితంగానే అటవీ సంపద పరిరక్షణతోపాటు అడవిపై ఆదివాసులకే హక్కు పొందడం, దేశం నుంచి ఆంగ్లేయులను పారదోలేందుకు బీజం వేశారన్నారు.

స్వతంత్ర సమరయోధుల మ్యూజియంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, గిరిజనులు మాట్లాడే భాష, వారు ఉపయోగించే పనిముట్లు ప్రపంచ దేశాలను ఆకర్షించేలా నిర్మాణం చేపట్టాలన్నారు. మన్య ప్రాంతం కోసం పోరాటం చేసిన మహానుభావులకు చిత్రాలు మ్యూజియంలో ఏర్పాటు చేసి, ఏటా విద్యార్థులు మ్యూజియంను సందర్శించి గిరిజన ప్రాంతం కోసం పోరాటం చేసిన మహానుభావుల చరిత్ర తెలుసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు విద్య, వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు..కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డేవిడ్‌రాజు, డిఇఇ జి రఘునాథ నాయుడు, ఎఇఇ యాదకిషోర్, స్వాతంత్ర సమర యోధుల మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ శంకరరావు, తహశీల్దార్ బి రవి కుమార్, ఎంపిడిఒ యువిఎస్ శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతోనే పార్టీ బలోపేతం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు: గ్రామ కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం పాడేరులోని తన స్వగృహంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు, నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం గ్రామ కమిటీల ద్వారానే లభిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ కీలక భూమిక పోషించబోతుందని, అందులో మనమంతా భాగస్వామ్యం కావాలని సూచించారు. గత ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలో వైసిపి గెలిచినా, ఇపుడు ఆ ప్రభావం లేదని, ప్రజలంతా తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన విధానానికి ప్రతి ఒక్కరూ ఆకర్షితులు అవుతున్నారని తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని కాపాడే శక్తి కేవలం చంద్రబాబు నాయుడు మాత్రమే ఉందనే విషయాన్ని ప్రజలంతా గ్రహించారని తెలిపారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో 164 స్థానాల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించారన్నారు.

భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా గ్రామ కమిటీలు బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ రెండు రోజుల్లో కెఎస్ఎస్‌లను, క్లస్టర్ ఇన్చార్జిల నియామకం పూర్తి అవ్వాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రతి పంచాయతీకి గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామ కమిటీల్లో ఉండే ప్రతి సభ్యుడు సమస్య పట్ల సానుకూలంగా స్పందించి, వాటిపరిష్కారానికి కృషిచేసేలా ఉండాలని సూచించారు.

మోడీ సభను విజయవంతం చేద్దాం

అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపనకు వచ్చేనెల 2న వచ్చే ప్రదాని మోడీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిడ్డి ఈశ్వరి కోరారు. ప్రతి గ్రామం నుంచి మోడీ సభకు తరలి వెళ్లేలా చూడాలని సూచించారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు బొర్రా విజయరాణి, బీసీ సెల్ ఉపాధ్యక్షులు పోలపర్తి గోవింద, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు డప్పోడి వెంకటరమణ (బుజ్జి), పార్లమెంట్ నియోజకవర్గ సభ్యురాలు డిప్పల కుమారి, పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి మల్లంగి సుబ్బలక్ష్మి, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల టిడిపి అధ్యక్షులు కూడి రామనాయుడు,వంతల కొండలరావు కిల్లో పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మండల పరిషత్ భవనం

- పెచ్చులూడుతున్న పైకప్పు : బీటలు వారిన గోడలు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

గోడలు బీటలువారి, పైకప్పు పెచ్చులూడుతున్న మండల పరిషత్ కార్యాలయ భవనం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయ భవనం మరమత్తుకు గురై శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. భవనం లోపల శ్లాబ్ , గోడలపై పెచ్చులు ఊడి పడుతుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. సిబ్బంది విధులు నిర్వర్తించే చోట శ్లాబ్ పెచ్చులు పడుతుండడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఉంది. సిబ్బంది కాకుండా వివిధ పనుల నిమిత్తం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన గిరిజనులు సైతం భయాందోళనకు గురవుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయ భవనం నిర్మించి సుమారు 22 ఏళ్లు దాటడంతో మరమ్మతులకు గురై శిథిలావస్థలో చేరుకుంటుంది. అప్పటినుంచి ఇప్పటివరకు ఎటువంటి నిర్వహణ, మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఏడాది క్రితమే టైల్స్ వేసినప్పటికీ పనుల్లో నాణ్యత లేకపోవడంతో అపుడే అవి ఊడిపోతున్నాయి. మండల అభివద్ధి కార్యక్రమాలకు నిలయంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉన్నా, కనీసం మరమ్మతులు చేయకపోవడం విచారకరమని మండల గిరిజనులు అంటున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయ భవనాలు మరమ్మతులుచేపట్టాలని మండల ప్రజా ప్రతినిధులు, గిరిజనులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విఆర్,పురం : ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విఆర్.పురం, మండలం కేంద్రంలోని రామాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మామిడి రాజు జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంబించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారని తెలిపారు.

వైద్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పక్షవాతం, గుండెపోటు, షుగర్, బీ.పీ, మందులు కూడా ప్రతి నెల ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఎవరికైనా ఆపరేషన్ చేయాలని డాక్టర్స్ నిర్ణయం చేస్తే ఆంధ్రా వనవాసి కళ్యాణ్ సొంత ఖర్చులతో రోగులను విశాఖపట్నం తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేసి వారికి మందులు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, రోగులు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న స్పీకర్, డిప్యూటీ స్పీకర్ సతీమణులు

స్పీకర్, డిప్యూటీ స్పీకర్ సతీమణులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, తదితరులు

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు సతీమణి రమాదేవి సోమవారం పట్టణంలోని మోదకొండమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మాజీ మంత్రి మణికుమారి, జెడ్‌పిమాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి, నియోజకవర్గ టిడిపి శ్రేణులు ఆలయం వద్ద వారికి ఆత్మీయ స్వాగతం పలికారు అనంతరం ఆలయ కమిటీ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతించి మోదకొండమ్మ దర్శనాన్ని కల్పించారు ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు కుంకుమలు పట్టు వస్త్రాలను సమర్పించి పూజలు జరిపారు అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ సతీమణులను సత్కరించి అమ్మవారి జ్ఞాపికలను అందజేశారు ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి మాట్లాడుతూ తమ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా పాడేరులో మోదకొండమ్మను ఆనవాయితీగా దర్శించుకుంటున్నామని,అమ్మవారి పట్ల తమకు భక్తి విశ్వాసాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు బుర్ర నాగరాజు, డప్పోడి బుజ్జి పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ కెందు

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో 10వ తరగతి తప్పిన విద్యార్థులకు ఈ నెల 28వ తేదీ నుండి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఎల్. రజిని సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో ప్రతి మండలంలోని బాలికలకు, బాలురకు ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ తరగతులు అందిస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క సబ్జెక్టుకు సబ్జెక్టు టీచర్లను, తెలుగు, ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులను నియమించి ప్రత్యేక బోధన అందిస్తున్నామని చెప్పారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 19 నుండి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

అరకులోయ: టెన్త్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే అరకులోయలోని కంఠ భౌమ్స్ గూడ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించారు. మే 18 వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సప్లిమెంటరీ ఎగ్జామ్స్ లో పాసై రెగ్యులర్ విద్యార్థులతో కళాశాలకు చేరాలని కోర్సు డైరెక్టర్లు పి.కెందు, ఎస్ నారాయణరావు, క్యాంప్ ఇంచార్జి ఎల్బీ.దయానిది లు సూచించారు. 186 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు సుమారు 100 మంది వరకు పాల్గొన్నట్లు నిర్వాహకులు హెచ్‌ఎం కెందు తెలిపారు. బాలికల కోసం కంఠ బమ్స్ గూడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతుల కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

'టెనెక్టో ప్లస్'తో తప్పిన ప్రాణాప్రాయం

మాట్లాడుతున్న డాక్టర్ మహేష్‌బాబు

ప్రజాశక్తి-విఆర్.పురం : రాష్ట్ర ప్రభుత్వం గుండె సంబంధిత వ్యాధులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచిన రూ.40వేలు విలువైన టెనెక్టో ప్లస్ ఇంజక్షన్ వల్ల ఓ నిరుపేద వ్యక్తి ప్రాణాలను కాపాడడం జరిగింది కూనవరం మండలం కోతులగుట్ట సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు తెలిపారు. వరరామచంద్రాపురం మండలం శ్రీరామగిరికి గ్రామానికి చెందిన ముత్యాల వెంకట నారాయణ శనివారం అస్వస్థతకు గురి కావడంతో కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు బంధువులు తీసుకెళ్లారు. ఛాతిలో నొప్పి, వొళ్ళంతా చెమటలు పడుతుండడంతో వైద్యాధికారులు ఆయనకు ఈసీజీ చేయగా, వెంకట నారాయణకు గుండె నొప్పిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు ,డ్యూటీ వైద్యాధికారి డాక్టర్ సి.తేజ గుర్తించారు. వెంటనే ఆసుపత్రిలో అందుబాటులో ఉంచిన రూ. 40 వేల విలువైన గుండెకు సంబంధించిన టెనెక్టో ప్లస్ ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తికి ప్రాణాప్రాయం తప్పిందని సూపరింటెండెంట్ డాక్టర్ కె మహేష్ బాబు తెలిపారు. పేషెంట్ సరైన సమయానికి ఆసుపత్రికి రావడం, వెంటనే ఇంజక్షన్ ఇవ్వడంతో ప్రాణాలు కాపాడమని తెలిపారు. ప్రస్తుతం ముత్యాల వెంకట నారాయణను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాజమండ్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కోతులగుట్ట ఆసుపత్రిలో టెనెక్టో ప్లస్ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని ఎవరికైనా గుండె సంబంధించిన సమస్య ఉన్నట్లయితే ఆలస్యం చేయకుండా రావాలని కోరారు. తన తండ్రి ప్రాణాలు కాపాడం పట్ల కుటుంబ సభ్యులు వైద్యాధికారులకు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : స్థానిక కూనవరం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా గ్రామ పెద్దలు చేతుల మీదగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాదేటి గోవిందరాజులు మాట్లాడుతూ ఈ శిబిరం ఈనెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు కథలు, సృజనాత్మక విషయాలు వంటి పలు అంశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గడ్డిపాటి ప్రసాదు, సచివాలయం ఉద్యోగిని టి.సాయిలక్ష్మి , రిటైర్డ్ హెచ్‌ఎం వెంకట స్వామి, మహమ్మద్ వహీద్, పిలక ప్రసాదు, బండారు నరసింహారావు, చెరుకూరు సుబ్బారావు, యాలం గౌతం, డోల రామ్మోహన్‌రావు, రాజు, కృష్ణార్జునరావు, కాచవరం బీడీసీ సూదిపాక శ్రీనివాసరావు, వి.ఆర్ పురం సబ్ స్టాఫ్ సత్యారాపు నాగరాజు, నోముల సాయి మహేష్, అధిక సంఖ్యలో విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.